జపాన్, జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులు

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 22: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) జపాన్ మరియు జర్మనీలలో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పన అధికారి నిర్మల తెలిపారు. 22 ఏండ్ల నుంచి 30 ఏండ్ల వయస్సు గల బీఎస్సీ నర్సింగ్ (జీఎన్ఎం, ఎఎన్ఎం) డిప్లమా హోల్డర్లు జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో ఎంపికైన అభ్యర్థులు నెలకు రూ.1.5 లక్షల నుంచి 1.8 లక్షలు అందజేస్తారని చెప్పారు. జర్మనీలో నర్సింగ్ అప్రెంటీస్ షిప్ ప్రోగ్రామ్ కోసం 18 నుంచి 28 ఏండ్ల వయస్సు ఇంటర్మీడియట్‌లో 60 శాతం లేదా అంత కంటే ఎక్కువ మార్కులు సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, ప్లేస్‌మెంట్‌పై అభ్యర్థులకు శిక్షణ సమయంలో నెలకు రూ. లక్ష స్టైపెండ్, ఇంకా ఉద్యోగ నియామకం తరువాత నెలకు రూ.3 లక్షల జీతం అందజేస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ రెజ్యూమ్‌లను TOMCOM.GERMANY@GMAIL.COMకు లేదా 89190 47600, 95739 45684, 63022 92450లలో సంప్రదించాలని సూచించారు.

ఓయూ అభివృద్ధి.. మందగమనం

- నత్త నడకన పాలన, హాస్టల్ భవనాలు
- ఇప్పటికే పూర్తి కావాల్సిన భవంతులెన్నో..
- మరో రెండేండ్లు పట్టొచ్చు..: అధికారులు
- అభివృద్ధిపై కొనసాగని కొత్త సర్కారు దృష్టి

ఆందోళన దిశగా విద్యార్థులు, అధ్యాపకులు

సిటీబ్యూరో, జనవరి 22(నమస్తే తెలంగాణ): ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధిలో భాగంగా కొనసాగుతున్న పలు రకాల నిర్మాణాలు, పురోగతి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. పనులలో పురోగతి చూపించాల్సిన అధికారులు నిర్మాణ పనులలో వేగం తగ్గించారు. వాస్తవానికి ఓయూలోని ఐఐసీటీ ఎదురుగా ఏర్పాటు చేస్తున్న రెండంతస్తుల పరిపాలన భవనం ఇప్పటికే దాదాపు 70 శాతం పనులు పూర్తి కావాల్సి ఉండేది. కాని, ఇప్పటి వరకు దాదాపు 30 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. పైగా గ్రౌండ్ ప్లస్ 2 అంతస్తులతో నిర్మిస్తున్న అత్యాధునికమైన హంగులతో పరిపాలన భవనం నిర్మిస్తున్నారు. దీనిని కేవలం కొద్ది కాలంలోనే పూర్తి చేసి, పరిపాలన సౌలభ్యం కోసం అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా రాష్ట్ర విద్య సంక్షేమ మౌలిక వసతి కల్పన అభివృద్ధి సంస్థకు అప్పగించారు. అయితే, గతంలో కేసీఆర్ ప్రభుత్వం హయాంలో ఈ భవనానికి సంబంధించిన పనులు వేగంగా కొనసాగాయి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన నూతన కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు ఓయూ అభివృద్ధి పనులపై పెద్దగా దృష్టి పెట్టినట్లుగా కనిపించడం లేదు. దీంతో ఓయూలో కొత్తగా నిర్మాణంలో ఉన్న భవనాల పనులు నత్త నడకన కొనసాగుతున్నాయి. కేవలం దీనిని ప్రారంభించిన 12 నెలల్లోనే పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ, ప్రస్తుత నిర్మాణ పరిస్థితులను చూస్తే, మరో ఏడాదైనా ఈ భవనం పూర్తయ్యే అవకాశాలు ఏ మాత్రం కనిపించడం లేదన్న అభిప్రాయాల్ని యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు. అయితే, విద్యార్థులు, పరిపాలన అవసరాల దృష్ట్యా పరిపాలన భవనాలతో పాటు కొత్త హాస్టళ్ల నిర్మాణాలు కూడా వేగంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఓయూ అధికారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయితే, ఈ విషయంలో ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్న విధానంపై విద్యార్థులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

నేడు టీ హబ్ ఎడ్ టెక్‌లో ఏఐ పాత్రపై సదస్సు

సిటీబ్యూరో, జనవరి 22(నమస్తే తెలంగాణ): విద్యా రంగంలో కృత్రిమ మేధస్సు(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ఏఐ) ప్రభావంపై ఐటీ రంగ నిపుణులతో మంగళవారం టీ హబ్‌లో ప్రత్యేకంగా సదస్సు నిర్వహిస్తున్నామని టీ హబ్ ప్రతినిధి తెలిపారు. అన్ని రంగాల్లోనూ ఏఐ వినియోగం గణనీయంగా పెరుగుతుండటంతో విద్యావేత్తలు, ఐటీ రంగ నిపుణులతో కలిసి చర్చించడం ద్వారా సరికొత్త ఆవిష్కరణలు చేయడానికి ఉన్న అవకాశాలపై దృష్టి పెట్టామని, అందులో భాగంగానే ఏఐపై పనిచేస్తున్న నిపుణులు స్వయంగా పాల్గొని, విద్యా రంగంలో దానిని ఏ విధంగా వినియోగించుకోవాలన్న అంశంపై తమ అభిప్రాయాలను తెలియజేయనున్నారని, ఔత్సాహిక స్టార్టప్ వ్యవస్థాపకులు ఈ సదస్సులో పాల్గొనవచ్చని, మరిన్ని వివరాలకు, పేర్లను నమోదు చేసుకునేందుకు ఈ కింది లింకు (https://tevents.t-hub.co/TailoredtoSucceedWhereEdTechMeetsAI)లో సంప్రదించాలని తెలిపారు.

27న సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్

సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ) ఆధ్వర్యంలో ఈ నెల 27న సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంతా తౌటం తెలిపారు. బాల వికాస్ సెంటర్ ఫర్ సోషల్ అండ్ రెస్పాన్సిబుల్ బిజినెస్‌తో కలిసి ఈ సదస్సును నిర్వహిస్తున్నట్టు, ఇందుకు ముఖ్య అతిథిగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి జయేష్ రంజన్‌లతో పాటు పలువురు పాల్గొంటారని ఆమె తెలిపారు.

దూర విద్యా విధానంతో నాణ్యమైన విద్య

అవుట్ కం బేస్డ్ ఎడ్యుకేషన్‌పై మూడు రోజుల సదస్సులో వీసీ సీతా రామారావు

సిటీబ్యూరో, జనవరి 22(నమస్తే తెలంగాణ): దూర విద్యా విధానం ద్వారా నాణ్యమైన విద్యా విధానం అందించడం చాలా అవసరమని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ (ప్రొఫెసర్ కే సీతారామారావు అన్నారు. ఓపెన్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ ఆధ్వర్యంలో 'అవుట్ కం బేస్డ్ ఎడ్యుకేషన్' (ఫలితాల ఆధార విద్య) అనే అంశంపై ప్రారంభించిన మూడు రోజుల సదస్సులో వీసీ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సార్వత్రిక విశ్వ విద్యాలయం నాణ్యమైన పాఠ్యాంశాల డిమాండ్‌కు కట్టుబడి ఉందన్నారు. ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్) ద్వారా నాణ్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ, అధ్యాపకులు నూతన అధ్యయన పద్ధతులు ఎప్పటికప్పుడు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏవీఎన్ రెడ్డి, ఇగ్నోకు చెందిన స్టాఫ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ. సంతోష్ పాండా, వర్సిటీకి చెందిన ఇన్ చార్జ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

సాయుధ దళాలకు ఎస్‌బీఐ ₹34,16,750 వితరణ

జూబ్లీహిల్స్, జనవరి 22: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సర్కిల్ ఉద్యోగులు తెలంగాణ సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి పెద్ద ఎత్తున వితరణ అందించారు. హైదరాబాద్ సర్కిల్ ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్ కుమార్, సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కల్నల్ రమేష్ కుమార్, డీజీఎం సీడీఓ జితేంద్ర కుమార్ శర్మ, లెఫ్టినెంట్ కమాండర్ అతుల్య ఆనంద్‌లతో కలిసి రూ.34,16,750/- చెక్కును గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర్ రాజన్‌కు సోమవారం అందజేశారు. సాయుధ దళాల జెండా దినోత్సవ నిధి చైర్ పర్సన్‌గా కూడా ఉన్న గవర్నర్ తమిళి సై సౌందర్ రాజన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పలువురికి స్ఫూర్తినిచ్చేలా ఎస్‌బీఐ ఉద్యోగులు చేపట్టిన మహోన్నత కార్యానికి అభినందనలు తెలిపారు. ఎస్‌బీఐ సీజీఎం రాజేశ్ కుమార్ మాట్లాడుతూ ఎస్‌బీఐలో సమాజానికి, దేశానికి తిరిగి ఇవ్వడం ద్వారా ఆయా వర్గాల పురోభివృద్ధికి దోహదపడతామన్నారు. కఠోరమైన వాతావరణంలో దేశ రక్షణకు పాటుపడుతున్న సైనికులకు మద్దతు ఇచ్చే విషయంలో ఎస్‌బీఐ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన అన్నారు.

WE STRONGLY CONDEMN ATTACK ... RAHUL GANDHI JI DURING BHAP JODO NYAYA YATRA IN ASSAM

ట్యాంక్‌బండ్‌పై అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు

అస్సాం ప్రభుత్వం రాహుల్‌కు క్షమాపణ చెప్పాలి

కవాడిగూడ, జనవరి 22: రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్రపై అస్సాంలోని సోనిత్‌పూర్ జిల్లాలో బీజేపీ దాడిని ఖండిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు సోమవారం రాత్రి నిరసన ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు బీజేపీకి మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షి, రాష్ట్ర ఐటీ శాఖ మంతిర శ్రీధర్ బాబు, మాజీ కేంద్ర మంత్రి రేణుక చౌదరి, బలరామ్ నాయక్, ఎమ్మెల్సీ బులమూరు వెంకట్ మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, మధు యాష్కీ గౌడ్, మాజీ మంత్రి పుష్పలీల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అస్సాం ప్రభుత్వం రాహుల్ గాంధీకి భద్రత కల్పించడంతో పూర్తిగా విఫలమైందని, కాంగ్రెస్ పార్టీకి అస్సాం ప్రభుత్వం తక్షణమే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న ధర్మ పీఠం వ్యవస్థాపకులు భూమయ్య

కేంద్ర చట్టాలు ఆక్షేపణీయం

- సహకార ధర్మపీఠం వ్యవస్థాపకులు భూమయ్య

ఖైరతాబాద్, జనవరి 22: సహకార రంగంపై కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన చట్టాల వల్ల ఆ రంగంపై అవి తీవ్ర ప్రభావం చూపుతున్నాయని సహకార ధర్మ పీఠం వ్యవస్థాపకులు సంభారపు భూమయ్య అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో 60 శాతం మంది ప్రజలు సొంత ఆర్థిక వ్యవస్థ అయిన సహకార సంస్థల హక్కులను కాలరాస్తూ కేంద్రం సెక్షన్ 12(1) బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, సెక్షన్ 26, 63 ఆఫ్ మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీ యాక్ట్‌లను తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టాలను అమలు చేయడం వల్ల రాజకీయ, ఆర్థిక, ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. సహకార సంఘాలు అక్రమంగా ప్రైవేట్ రంగం స్వాధీనమవుతాయన్నారు. దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్‌తో పాటు సహకార రంగం ఎంతో కీలకమైందన్నారు. ఈ చట్టాల వల్ల రైతులు, గ్రామీణ, చేతి వృత్తిదారుల, బలహీన వర్గాల సమష్టి సహకార వ్యాపార సంస్థలు పెట్టుబడిదారుల పరమవుతాయన్నారు. ఈ చట్టాలను ఉపసహరించుకోవాలని గతేడాది డిసెంబర్ 28న హైదరాబాద్ సహకార ధర్మ రక్షక్ మహాభారత్ యాత్రను ప్రారంభించానని, ఈ యాత్రలో భాగంగా అన్ని రంగాల ప్రతినిధులు కలిసి వారి మద్దతును కోరుతానని అన్నారు.

ఓయూ ఉద్యోగుల స్పోర్ట్స్‌మీట్ ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ రవీందర్

ఓయూలో ఉద్యోగుల స్పోర్ట్స్‌మీట్

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 22: ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్‌ను సోమవారం నిర్వహించారు. ఈ క్రీడోత్సవాలను ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ బెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఉద్యోగులు అందరు క్రీడలు, వ్యాయామం, యోగాలకు సమయం కేటాయించాలన్నారు. తద్వారా శారీరక ఉల్లాసంతో పాటు మానసిక ఉల్లాసం పొందవచ్చన్నారు. స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నందుకు ఉద్యోగ సంఘాల నాయకులను అభినందించారు. శతాధిక వసంతాల ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర మరవలేనిదన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యా నాయక్, యూజీసీ ఎఫైర్స్ డీన్ ప్రొఫెసర్ మల్లేశం, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ శ్రీరాములు, ప్రొఫెసర్ వీరయ్య, ప్రొఫెసర్ సత్యనారాయణ, తుంటియా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీపీ నిర్మాణ పనుల పరిశీలన

సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ): జల మండలి నిర్మిస్తున్న పలు ఎస్టీపీలను ఎండీ సుదర్శన్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా నల్ల చెరువు ఎస్టీపీ పనుల పురోగతిని ఎండీ పరిశీలించారు. మురుగునీటి శుద్ధి కేంద్రం పనితీరు, నిర్వహణ పద్ధతుల్ని ఈడీ డాక్టర్ సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌బాబు ఎండీకి వివరించారు. ఈ ఎస్టీపీ ఇటీవల ట్రయల్ రన్ పూర్తి చేసుకోగా, ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఎండీ సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. అనంతరం పెద్ద చెరువు ఎస్టీపీని సందర్శించారు. ఔట్‌లెట్ వద్ద చెరువులో కలుస్తున్న శుద్ధి చేసిన నీటి నాణ్యతను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీజీఎం సుజాత, ఎస్టీపీ జీఎం, ఇతర అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈఎంఆర్ఐలో ఉద్యోగవకాశాలు

మేడ్చల్ రూరల్, జనవరి 22: గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలో గల ఈఎంఆర్ఐ-హెచ్ఈఆర్ఎఫ్‌లో ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేసేందుకు గాను అభ్యర్థుల ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని సంస్థ జిల్లా ప్రోగ్రాం అధికారి షేక్ జాన్ షాహిద్ ఓ ప్రకటనలో తెలిపారు. బీ టెక్ పూర్తి చేసిన వారు నేటి నుంచి ఈ నెల 25 వరకు ఈఎంఆర్ఐ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలో పాల్గొనాలని తెలిపారు. మూడు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ ఇంటర్వ్యూలో ఆసక్తి గల యువకులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరాడు.

నాలెడ్జ్ సిటీలో రివీల్ ఐటీ సంస్థ ప్రారంభం

రివీల్ సంస్థ ప్రారంభోత్సవంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్

కొండాపూర్, జనవరి 22: ప్రముఖ ఏఐ ఆధారిత ఇ డిస్కవరీ, రివ్యూ, రీసెర్చ్ ప్లాట్‌ఫారమ్ ప్రొవైడర్ సంస్థ 'రివీల్' తమ నూతన కార్యాలయాన్ని సోమవారం నగరంలోని నాలెడ్జ్ సిటీలో ప్రారంభించింది. ప్రారంభోత్సవానికి తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆసియా - పసిఫిక్‌లో తమ కార్యకలాపాలను కొనసాగించే దిశగా దేశంలో ప్రధానంగా హైదరాబాద్ నగరంలో ప్రారంభించినట్లు రివీల్ వ్యవస్థాపకులు, సీఈఓ వెండెల్ జిసా తెలిపారు. ఐటీ రంగానికి కేరాఫ్‌గా దూసుకుపోతున్న హైదరాబాద్ నగరంలో సంస్థను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

జల మండలి ఇంజినీర్స్ డైరీ ఆవిష్కరణ

సిటీబ్యూరో, జనవరి 22(నమస్తే తెలంగాణ): జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ (జేఈఏ) నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ సోమవారం జరిగింది. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎండీ సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈడీ డాక్టర్ ఎం.సత్యనారాయణ, డైరెక్టర్లు అజ్మీరా కృష్ణ, శ్రీధర్‌బాబు, వీఎల్ ప్రవీణ్ కుమార్, రవి కుమార్, జేఈఏ అధ్యక్షుడు రాజశేఖర్, జనరల్ సెక్రటరీ హరి శంకర్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- బేగంపేట్ తాజ్ వివంతాలో ఉ. 11:30 గంటలకు మహీంద్రా యూనివర్శిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యా విధానంపై ప్రెస్ కాన్ఫరెన్స్.
- శ్రీత్యాగరాయ గానసభలో సా.5:30 గంటలకు మీడియా పురస్కారాలు.
- బంజారాహిల్స్‌లో రోడ్ నం.10 అవర్ ప్లేస్ బంకెట్ హాల్‌లో సాయంత్రం 4:30 గంటలకు జనవరి 26 నుంచి 28 వరకు జల విహార్‌లో 'ధ్వజాజీ ఆనంద్ ఉత్సవ్'పై ప్రెస్ కాన్ఫరెన్స్.

గమనిక: నగరంలో జరిగే కార్యక్రమాల వివరాలను ntgcitybureau@gmail.comకు పంపగలరు.

విదేశీ విద్యార్థులకు ఇంగ్లిష్ సర్టిఫికెట్ కోర్సులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 22: ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ సెంటర్ (ఈఎల్‌టీసీ)లో విదేశీ విద్యార్థులకు ఇంగ్లిష్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వొకాబులరీ, గ్రామర్, లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ స్కిల్స్ తదితర అంశాలను ఈ కోర్సులో భాగంగా నేర్పిస్తారు. ఈ కోర్సు తరగతులను వచ్చే నెల 19వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజూ మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు తరగతులను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్లు 99635 28516, 93930 59033 లలో సంప్రదించాలని సూచించారు.

ఓయూ భూములపై ఎస్టీపీ నిర్మాణం

సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ): ఓయూ భూములపై ఎస్టీపీ నిర్మాణం చేపట్టడాన్ని నిరసిస్తూ సోమవారం ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఓయూ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కిషన్ మాట్లాడుతూ, ఓయూ భూములపై ఎస్టీపీ నిర్మాణం చేపట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఓయూ భూములపై ఎస్టీపీ నిర్మాణం చేపట్టడం వల్ల ఓయూ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఓయూ భూములపై ఎస్టీపీ నిర్మాణం చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 25న ఓయూ బంద్‌కు పిలుపునిస్తున్నామని తెలిపారు.

రాజీవ్ గాంధీ క్రికెట్ టోర్నీ విజేత హైదరాబాద్

హైదరాబాద్ ఆట ప్రతినిధి, జనవరి 22: రాజీవ్‌గాంధీ ఆల్ ఇండియా అండర్ -19 టీ20 చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ జట్టు విజేతగా నిలిచింది. ఎల్బీ స్టేడియంలో సోమవారం జరిగిన ఫైనల్లో హైదరాబాద్ ఒక వికెట్ తేడాతో సీఎఫ్ఐపై అద్భుత విజయం సాధించింది. తొలుత సీఎఫ్ఐ నిర్ణీత 20 ఓవర్లలో 154 పరుగులకు ఆలవుటయ్యింది. అర్ష్ కబీర్(49), ఆశిష్ రాయ్(44) రాణించారు. ప్రేమ్ మనోహర్, మధువీర్ రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన హైదరాబాద్ 19.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. అభినవ్(77) అర్ధ సెంచరీతో అదరగొట్టాడు. ఆశిష్ రాయ్(4/27) నాలుగు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు హాజరయ్యారు. అభినవ్‌కు 'బెస్ట్ బ్యాటర్' అవార్డు దక్కింది.

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న నాయకులు

26న నిరసన ర్యాలీ

హిమాయత్‌నగర్, జనవరి 22: కేంద్ర ప్రభుత్వం రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 26న జరిగే ట్రాక్టర్, వాహనాల ర్యాలీలో ప్రజలు అధిక సంఖ్యల్లో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ సంయుక్త కిసాన్ మోర్చా కమిటీ పిలుపు నిచ్చారు. ఆ ర్యాలీకి సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర కన్వీనర్లు పశ్య పద్మ, టి.సాగర్, బాల మల్లేశ్, చంద్రశేఖర్, భిక్షపతి, జక్కుల వెంకటయ్యలు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు ధారా దత్తం చేసేందుకు మోదీ కంకణం కట్టుకున్నాడని, బీజేపీ పాలనలో పేదరికం, నిరుద్యోగ సమస్యతో పాటు అధికంగా ధరలు పెరిగిపోయాయని ఆరోపించారు. ఈ నెల 26న బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరా పార్కు వరకు వాహనాల ర్యాలీ, ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్ కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు బాల్‌రాజ్, ఎస్ ఎల్.పద్మ, శంకర్, పల్లవి, కాంతయ్య, ప్రసాద్, పద్మ, ప్రభులింగం, నీతూ శర్మ, సామల వెంకట్ రెడ్డి, కనకయ్య, సురేష్ పాల్గొన్నారు.